18-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఆత్మ మరియు పరమాత్మల మిలనమే సత్యాతి-సత్యమైన సంగమము లేక కుంభమేళ, ఈ మిలనము ద్వారానే మీరు పావనముగా అవుతారు, దీని స్మృతిచిహ్నముగానే వారు మేళాలను జరుపుతారు"

ప్రశ్న:- పిల్లలైన మీకు ఏ విషయములో చాలా-చాలా వివేకము కావాలి?

జవాబు:- జ్ఞానానికి సంబంధించిన నాజూకైన విషయాలేవైతే ఉన్నాయో, వాటిని అర్థం చేయించేందుకు చాలా వివేకము కావాలి. యుక్తిగా జ్ఞాన మార్గమును మరియు భక్తి మార్గమును నిరూపించాలి. ఏ విధంగా ఎలుక ఊది, ఆ తర్వాత కొరుకుతుందో, అదే విధంగా అర్థం చేయించాలి, కావున సేవకు యుక్తులను రచించాలి. కుంభమేళాలో ప్రదర్శనీని ఏర్పాటు చేసి అనేక ఆత్మల కళ్యాణము చేయాలి. పతితుల నుండి పావనులుగా అయ్యేందుకు యుక్తిని తెలియజేయాలి.

పాట:- ఈ పాపపు ప్రపంచము నుండి... (ఇస్ పాప్ కీ దునియా సే...)

ఓం శాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు - పాపపు ప్రపంచాన్ని కలియుగీ, పతిత, భ్రష్టాచారీ ప్రపంచము అని అంటారు మరియు పుణ్య ప్రపంచాన్ని సత్యయుగీ, పావన, శ్రేష్ఠాచారీ ప్రపంచము అని అంటారు. పరమాత్మయే వచ్చి పుణ్యాత్ములను, పవిత్రాత్మలను మరియు పుణ్య ప్రపంచాన్ని తయారుచేస్తారు. మనుష్యులు - పతిత-పావనుడైన తండ్రిని పిలుస్తారు ఎందుకంటే వారు స్వయం పావనముగా లేరు. ఒకవేళ గంగను లేక త్రివేణిని పతిత-పావనిగా భావిస్తే మళ్ళీ ఓ పతిత-పావనా రండి అని ఎందుకు పిలుస్తారు? గంగ లేక త్రివేణి అయితే ఎప్పటినుండో ఉన్నాయి, అవి ఉన్నప్పటికీ తండ్రిని పిలుస్తూ ఉంటారు. బుద్ధి ఎంతైనా పరమాత్మ వైపుకు వెళ్తుంది. పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడు, వారు రావలసి ఉంటుంది. కేవలం ఆత్మ అని అనరు, పవిత్ర జీవాత్మ అని అంటారు. ఇప్పుడు పావన జీవాత్మలు అయితే ఎవ్వరూ లేరు. ఎప్పుడైతే సత్యయుగ పావన ప్రపంచాన్ని స్థాపన చేయాల్సి ఉంటుందో మరియు కలియుగ ప్రపంచాన్ని వినాశనము చేయాల్సి ఉంటుందో, అప్పుడే పతిత-పావనుడైన తండ్రి వస్తారు. తప్పకుండా సంగమయుగంలోనే వస్తారు. సంగమాన్ని కుంభమేళ అని కూడా అంటారు. త్రివేణి సంగమము ఉంది, దానికి కుంభమేళ అన్న పేరును పెట్టారు. మూడు నదులు పరస్పరంలో కలుసుకుంటాయని చెప్తారు. వాస్తవానికి రెండు నదులే ఉన్నాయి, మూడవ నదిని గుప్త నది అని అంటారు. మరి ఆ కుంభమేళాలో పతితుల నుండి పావనులుగా అవుతారా? పతిత-పావనుడు తప్పకుండా రావాల్సి ఉంటుంది. వారే జ్ఞానసాగరుడు. పతిత ప్రపంచాన్ని పావనంగా తయారుచేయడము, కలియుగాన్ని సత్యయుగముగా తయారుచేయడము - ఇది పరమపిత పరమాత్మని పనే, అంతేకానీ మనుష్యులది కాదు. ఇదంతా అంధవిశ్వాసము. ఇప్పుడు అంధులకు చేతికర్ర అవ్వాలి. మీరు ఇప్పుడు నంబరువారు పురుషార్థానుసారంగా చేతికర్రలుగా అయ్యారు. చేతికర్రలు కూడా రకరకాలవి ఉంటాయి. కొన్ని చేతికర్రలు వంద రూపాయలకు మరియు కొన్ని రెండు రూపాయలకు కూడా లభిస్తాయి. ఇక్కడ కూడా అందరూ నంబరువారుగా ఉన్నారు. కొందరు ఎంతో సర్వీసబుల్ గా ఉన్నారు. ఎప్పుడైతే వ్యాధిగ్రస్థులుగా అవుతారో అప్పుడు సర్జన్ ను పిలవాల్సి వస్తుంది. ఇప్పుడిది పతిత ప్రపంచము. మీరు పావనంగా అవుతున్నారు. ఆత్మ- పరమాత్మ ఎంతో కాలంగా వేరుగా ఉన్నారు అని అంటూ ఉంటారు, మళ్ళీ ఎప్పుడైతే పరమపిత పరమాత్మ అనేక ఆత్మల మధ్యకు వస్తారో అప్పుడు దానిని సంగమయుగపు కుంభమేళ అని అంటారు.

మనుష్యులు కుంభమేళాలో ఎన్నో దానాలు చేస్తారు. అది సాధు-సన్యాసులకు మరియు ప్రభుత్వానికి సంపాదనగా అవుతుంది. ఇక్కడ మీరు తనువు, మనస్సు, ధనము సహితంగా అన్నింటినీ పతిత-పావనుడైన తండ్రికి దానం చేయాల్సి ఉంటుంది. వారు తిరిగి భవిష్యత్తులో మిమ్మల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు. వారు త్రివేణి పేరు తీసుకుంటారు కానీ దానము సాధు-సన్యాసులకు చేస్తారు. వాస్తవానికి ఎక్కడైతే అన్ని నదులూ వచ్చి సాగరంలో కలుస్తాయో, దానినే సంగమము అని అంటారు. అక్కడ సాగరము లేదు. ఇక్కడైతే నదులు పరస్పరం కలుసుకుంటాయి. నదులు మరియు సాగరం యొక్క మిలనమునే సత్యాతి-సత్యమైన మేళా అని అంటారు. కానీ ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. ఇందులో గవర్నమెంట్ కు కూడా రైళ్ళు, మోటారు-బళ్ళు, భూమి మొదలైనవాటి ద్వారా ఎంతో సంపాదన లభిస్తుంది. కావున ఇది సంపాదన కొరకు ఉన్న మేళా వలె అనిపిస్తుంది. ఈ విషయాలను పిల్లలైన మీరే నిర్ణయించుకోగలరు ఎందుకంటే మీరు ఈశ్వరీయ మతముపై ఉన్నారు. కావున కుంభమేళ యొక్క

అర్థాన్ని వెలికితీయాలి. బాబా ఇటువంటి వ్యాసాలను ఇస్తారు. వివేకవంతులైన పిల్లలెవరైతే ఉన్నారో, వారు ఈ వ్యాసాలను చేపట్టాలి. అందరికన్నా నంబరు వన్ వివేకవంతులు మమ్మా, ఆ తర్వాత సంజయుడు. పంచడానికని వారు కరపత్రాలను తయారుచేయాల్సి ఉంటుంది. ఈ త్రివేణి పతిత-పావని కాదు. పతిత-పావనుడు సర్వుల సద్గతిదాత అయిన ఒక్క శివబాబాయే. త్రివేణిని సద్గతిదాత అని అనరు. ఈ నదులు ఎప్పటినుండో ఉన్నాయి కావున అవి ఎక్కడి నుండో వచ్చే విషయమే లేదు. పతిత-పావనా రండి, వచ్చి పావనంగా తయారుచేయండి అని అంటూ ఉంటారు. కావున ఈ విధంగా కరపత్రాలను తయారుచేయాలి - సోదరీ-సోదరులారా, జ్ఞానసాగరుడైన పరమపిత పరమాత్మ పతిత-పావనుడా లేక ఈ నదులా? ఈ నదులైతే ఎప్పటినుండో ఉన్నాయి. పరమాత్మనైతే రమ్మని పిలుస్తూ ఉంటారు. వాస్తవానికి పతిత-పావనుడు ఒక్క పరమాత్మయే. ఆత్మలు మరియు పరమాత్మ ఎంతోకాలం వేరుగా ఉన్నారు... ఆ సద్గురువే వచ్చి అందరికీ సద్గతినిచ్చి తిరిగి తీసుకువెళ్తారు. జ్ఞాన స్నానమైతే వాస్తవానికి పరమపిత పరమాత్మ ద్వారానే చేయాలి. పావన ప్రపంచ స్థాపనను పరమపిత పరమాత్మయే చేయిస్తారు. మీకు వారి గురించి తెలియదు. భారత్ శ్రేష్ఠాచారిగా ఉన్నప్పుడు అందులో దేహీ-అభిమానులైన దేవతలు ఉండేవారు, దానిని శివాలయమని అంటారు. ఇప్పుడు పిల్లలు కుంభమేళా వద్దకు వెళ్ళి అర్థం చేయించేందుకు ప్రదర్శనీని ఏర్పాటు చేయాలి. ఇలా అర్థం చేయించాలి - పతిత-పావనుడు ఒక్క తండ్రియే, వారు అంటారు, ఎప్పుడైతే పతితుల నుండి పావనులుగా తయారుచేయాల్సి ఉంటుందో అప్పుడే నేను వస్తాను కావున ప్రతిజ్ఞను చేయాల్సి ఉంటుంది. రక్షాబంధనము భగవంతునితో సంబంధాన్ని జోడిస్తుంది, అంతేకానీ సాధు-సన్యాసులతో కాదు. ప్రతిజ్ఞ అనేది పరమపిత పరమాత్మునితో చేయడం జరుగుతుంది, అంతేకానీ త్రివేణితో కాదు. ఓ బాబా, మేము మీ శ్రీమతంపై పావనంగా అయ్యేందుకు ప్రతిజ్ఞను చేస్తాము. తండ్రి కూడా అంటారు - నేను మిమ్మల్ని పావన ప్రపంచానికి యజమానులుగా చేస్తాను. ఇవి బాబా ఇచ్చే సూచనలు. ఇక్కడ సేవ చేసేవారు చాలా చురుకైనవారై ఉండాలి. చిత్రాలు కూడా ఇంకా తయారుచేయించాల్సి ఉంటుంది. దీని కొరకు మంచి మండపాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. మీకు ఎంతోమంది శత్రువులుగా కూడా అవుతారు, కొన్ని సార్లు మంటలు అంటించడానికి కూడా వెనుకాడరు. ఎవరైనా కొట్లాట పెట్టుకోవాలనుకుంటే మొదట తిట్టడం మొదలుపెడతారు. మీరైతే నిరహంకారులుగా అయి మౌనంలో ఉండాల్సి ఉంటుంది. బ్రహ్మాకుమారీలు ప్రసిద్ధముగానైతే అయ్యారు. కరపత్రాలు మొదలైనవి తప్పకుండా పంచాలి. కుంభమేళా పట్ల విశేషమైన మహత్వాన్ని ఉంచుతారు. వాస్తవానికి ఆ మహత్వము ఇప్పటిదే, ఇది కూడా డ్రామా ఆటయే. అక్కడి నుండి కూడా ఎవరి కళ్యాణమైనా జరగవచ్చు. కానీ కష్టపడాల్సి ఉంటుంది. ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడములో శ్రమ అనిపిస్తుంది. కుంభమేళాలో ప్రదర్శనీని పెట్టడానికి కూడా ధైర్యం కావాలి, ఏ విఘ్నాలు కలగకుండా ఉండేందుకు అన్నీ తెలిసినవారు కావాలి. పతిత-పావనుడు ఎవరు? అన్నది మీరు నిరూపించాలి. మనుష్యులు పావన ప్రపంచమైన స్వర్గాన్ని కూడా తలచుకుంటారు. ఎవరైనా మరణిస్తే ఫలానావారు స్వర్గవాసులయ్యారని అంటారు. అక్కడైతే ఎంతో రుచికరమైన భోజనం ఉంటుంది, మరి అక్కడి నుండి ఇక్కడకు పిలిచి ఎందుకు తినిపిస్తారు? మీరు శ్రీనాథుని మందిరంలో చూస్తారు - ఎన్ని వంటకాలు తయారవుతాయి. ఇప్పుడు శ్రీనాథపురి మరియు జగన్నాథపురి వాస్తవానికి ఒక్కటే, కానీ అక్కడ శ్రీనాథ ద్వారములో చూసినట్లయితే ఎన్నో వైభవకరమైన వంటకాలు తయారవుతాయి మరియు జగన్నాథపురిలో కేవలం చప్పటి అన్నమును భోగ్ పెడతారు, నెయ్యి మొదలైనవేమీ వెయ్యరు. తెల్లగా ఉన్నప్పుడు ఇటువంటి వంటలు మరియు నల్లగా ఉన్నప్పుడు చప్పటి అన్నము అన్న తేడా కనిపిస్తుంది. ఈ రహస్యము చాలా బాగుంది. ఈ విషయాలను తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. శ్రీనాథ ద్వారములో ఎంత నైవేద్యాన్ని అర్పిస్తారంటే ఆ తర్వాత దానిని పూజారులు దుకాణాలలో అమ్ముకుంటారు కూడా. వారి సంపాదనకు ఆధారము కూడా దానిపై ఉంది. వారికది లభించడం ఉచితంగా లభిస్తుంది, దానితో వారు సంపాదించుకుంటారు. కావున చూడండి, ఇవి ఎంత అంధవిశ్వాసముతో కూడిన విషయాలు. ఇది భక్తి మార్గము. జ్ఞాన మార్గము సద్గతి మార్గము, గంగా స్నానాల ద్వారా సద్గతి ఏమైనా లభిస్తుందా. చాలా యుక్తిగా అర్థం చేయించాలి. ఏ విధంగానైతే ఎలుక ఊది, ఆ తర్వాత కొరుకుతుంది. అర్థం చేసుకునేందుకు మరియు అర్థం చేయించేందుకు చాలా వివేకము కావాలి. ఇవి ఎంత నాజూకైన విషయాలు. ఓ పరమపిత పరమాత్మా, మీరు ఇచ్చే గతి మరియు మీరు చూపే మార్గము మీకే తెలుసు అని మనుష్యులు అంటారు. కానీ దీని అర్థాన్ని అర్థమే చేసుకోరు. మీ శ్రీమతము ద్వారా ఏ సద్గతి అయితే లభిస్తుందో దానిని మీరే అందించగలరు, ఇంకెవ్వరూ అందించలేరు. సర్వుల సద్గతిదాత ఒక్కరే. సర్వుల అన్న పదాన్ని తప్పకుండా వ్రాయాలి. ఎంతో అర్థం చేయించడం జరుగుతుంది, కానీ అర్థం చేసుకునేవారు చాలా కొద్దిమందే వెలువడుతారు. ప్రజలైతే ఎందరో తయారవుతూ ఉంటారు.

మనుష్యులు భగవంతుని పేరు మీద ఎన్నో దాన-పుణ్యాలు చేసినట్లయితే ఒక్క జన్మ కొరకు ఫలము లభిస్తుంది. ఇక్కడైతే 21 జన్మల కొరకు లభిస్తుంది. ఈశ్వరార్థం దానం చేయడం ద్వారా శక్తి లభిస్తుంది. వారికి ఈశ్వరుని గురించి

తెలియనే తెలియదు కావున ఇక శక్తియే మిగలలేదు. హిందువులకు గురువులు, పండితులైతే ఎందరో ఉన్నారు. క్రిస్టియన్లను చూసినట్లయితే వారికి ఒక్కరే ఉన్నారు. ఆ ఒక్కరికీ ఎంత గౌరవముంది. ధర్మమే శక్తి అని అంటారు. ఇప్పుడు మీరు ధర్మాన్ని అర్థం చేసుకున్నారు కావున ఎంతటి శక్తి లభిస్తుంది. బాబా అంటారు - పిల్లలూ, అందరికీ ఈ వశీకరణ మంత్రాన్నే ఇవ్వండి. పిల్లలతో తండ్రి అంటారు - మీరు ఎక్కడి నుండైతే వచ్చారో దానిని స్మృతి చేసినట్లయితే అంతిమ స్మృతిని బట్టి గతి ఏర్పడుతుంది. తండ్రిని స్మృతి చేయడం ద్వారానే పావనంగా అవ్వగలుగుతారు, పాపాలు దగ్ధమవుతాయి. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి, తద్వారా మొత్తం చక్రమంతా బుద్ధిలోకి వచ్చేస్తుంది. గృహస్థ వ్యవహారములో ఉంటూ దేహపు సర్వ సంబంధాల నుండి బుద్ధిని తొలగించి ఒక్క తండ్రితో జోడించే పురుషార్థాన్ని చేయాలి. తద్వారా అంతిమ సమయములో కూడా వారే గుర్తుకొస్తారు. ఇంకెవరి స్మృతి అయినా కలిగినట్లయితే శిక్షలు అనుభవించాల్సి వస్తుంది మరియు పదవి కూడా తగ్గిపోతుంది. కావున వాస్తవానికి కుంభమేళ అని కల్పము యొక్క సంగమమునే అంటారు, ఆ సమయములోనే ఆత్మలు మరియు పరమాత్మ కలుసుకుంటారు. పరమాత్మయే వచ్చి రాజయోగాన్ని నేర్పిస్తారు. వారు పునర్జన్మ రహితుడు. కానీ పిల్లలు కూడా అర్థం చేసుకోరు. శ్రీమతంపై నడవకపోతే నావ తీరానికి ఎలా చేరుకోగలదు? నావ తీరానికి చేరుకోవడము అనగా రాజ్యపదవిని పొందడము. శ్రీమతం ద్వారానే రాజ్యము లభిస్తుంది. శ్రీమతంపై నడవకపోతే చివరిలో అంతమైపోతారు. ఎవరి దీపమైతే వెలిగి ఉంటుందో, ఆ ప్రేయసులే తోడుగా వెళ్తారు. ఎవరి దీపాలైతే ఆరిపోయి ఉన్నాయో వారు ఏమైనా తోడుగా వెళ్తారా. అనన్యులైన పిల్లలే వెళ్తారు. మిగిలినవారైతే నంబరువారుగా చివరిలో వస్తారు, కానీ పవిత్రంగా అయితే అందరూ అవుతారు. ఆత్మలందరూ ఒకే విధమైన శక్తి కలవారిగా ఉండరు. ప్రతి ఆత్మ పాత్ర ఎవరిది వారిదే. ఒకే విధమైన పదవి లభించదు. అంతిమంలో అందరి పాత్ర స్పష్టమైపోతుంది. వృక్షం ఎంత పెద్దది, ఎంతమంది మనుష్యులు ఉన్నారు! ముఖ్యమైన పెద్ద-పెద్ద శాఖలు ఏవైతే ఉన్నాయో అవి కనిపిస్తాయి. ముఖ్యమైనది ఫౌండేషన్, మిగిలినవన్నీ తర్వాత వస్తాయి, వాటిలో శక్తి తక్కువగా ఉంటుంది. స్వర్గములోకి అందరూ రాలేరు. భారత్ యే స్వర్గముగా ఉండేది. భారత్ కు బదులుగా జపాన్ ద్వీపము స్వర్గముగా అవుతుందని కాదు, అలా జరగదు. అచ్ఛా!

బాప్ దాదా మరియు మాత-పిత యొక్క మధురాతి-మధురమైన ప్రియమైన సికీలధే జ్ఞాన సితారలైన పిల్లలకు ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

రాత్రి క్లాసు **- 24-4-68**

ఇతర ధర్మస్థాపకులెవ్వరూ సర్వుల కళ్యాణాన్ని చేయలేరని పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. వారూ వస్తారు, అందరినీ తీసుకువస్తారు. ఎవరైతే విముక్తులుగా చేసి మార్గదర్శకులుగా అవుతారో, వారి గాయనమే ఉంది. వారు భారత్ లోనే వస్తారు. కావున భారత్ అన్నింటికన్నా ఉన్నతమైన దేశము అయినట్లు. భారత్ ను ఎంతగానో మహిమ చేయాలి. తండ్రియే వచ్చి సర్వుల సద్గతిని చేస్తారు, అప్పుడే శాంతి ఏర్పడుతుంది. సృష్టి ఆదిలో విశ్వములో శాంతి ఉండేది. స్వర్గములో ఒకే ధర్మము ఉండేది. ఇప్పుడు అనేక ధర్మాలు ఉన్నాయి. తండ్రియే వచ్చి శాంతి స్థాపన చేస్తారు. కల్పక్రితం వలె చేస్తారు. పిల్లలైన మీకు జ్ఞానం లభించింది కావున విచార సాగర మంథనము నడుస్తుంది. ఇంకెవ్వరికీ ఇలా నడవదు. ఇది కూడా మీరు అర్థం చేసుకున్నారు. దేహాభిమానం కారణంగా దేహాన్నే పూజిస్తారు. ఆత్మ పునర్జన్మలనైతే తప్పకుండా ఇక్కడే తీసుకుంటుంది కదా. పావనులైతే ఒక్కరే అని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. తండ్రియే గుప్తమైన జ్ఞానాన్ని ఇస్తారు, దాని ద్వారా సర్వుల సద్గతి జరుగుతుంది. ఇకపోతే హనుమంతుడు, గణేశుడు మొదలైనవారెవ్వరూ ఉండనే ఉండరు. వీరందరినీ పూజారులు అని అంటారు. అచ్ఛా!

ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి మరియు దాదా యొక్క ప్రియస్మృతులు మరియు గుడ్ నైట్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము**:-**

1. శిక్షల నుండి రక్షించుకునేందుకు దేహపు సర్వ సంబంధాల నుండి బుద్ధియోగాన్ని తొలగించి ఒక్క తండ్రితో బుద్ధియోగాన్ని జోడించాలి. అంతిమ సమయంలో తండ్రి తప్ప ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు.

2. నిరహంకారులుగా అయి మౌనములో ఉంటూ ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడానికి శ్రమించాలి. శ్రీమతంపై

అంధులకు చేతికర్రగా అవ్వాలి. పావనులుగా అయి పావనులుగా తయారుచేయాలి.

వరదానము:- సమర్థ సంకల్పాల ద్వారా జమా ఖాతాను పెంచుకునే హోలీ హంస భవ

ఏ విధంగా హంసలు రాళ్ళను మరియు రత్నాలను వేరు చేస్తాయో, అదే విధంగా హోలీ హంసలైన మీరు సమర్థాన్ని మరియు వ్యర్థాన్ని పరిశీలించేవారు. ఏ విధంగా హంసలు ఎప్పుడూ రాళ్ళను ఏరవు, వాటిని వేరు చేసి పెడతాయి, వదిలేస్తాయి, గ్రహించవు, అదే విధంగా హోలీ హంసలైన మీరు వ్యర్థాన్ని వదిలి సమర్థ సంకల్పాలను ధారణ చేస్తారు. వ్యర్థాన్ని ఎంతోకాలం విన్నారు, మాట్లాడారు, చేసారు కానీ దాని ఫలితంగా సర్వస్వాన్నీ కోల్పోయారు. ఇప్పుడు పోగొట్టుకునేవారిగా కాకుండా జమా ఖాతాను పెంచుకునేవారిగా ఉన్నారు.

స్లోగన్:- స్వయాన్ని ఈశ్వరీయ మర్యాదలనే కంకణంలో బంధించుకున్నట్లయితే సర్వ బంధనాలు సమాప్తమైపోతాయి.